సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 3 । మే । 2024



చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,152 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



విత్తన నాణ్యతకు పెద్దపీట
కల్తీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు జగన్ సర్కార్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 అగ్రిల్యాబ్స్‌ను ఏర్పాటు చేసింది. తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
44.1°/26.2°
జిల్లావ్యాప్తంగా గురువారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాల్పుల తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

రేపు జిల్లాకు సీఎం జగన్



- 11 గంటలకు హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ
- హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన చేసిన ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్ కుమార్



హిందూపురంలోని ఎంజీఎం గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్

సాక్షి, పుట్టపర్తి

ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 4వ తేదీ (శనివారం) జిల్లాకు రానున్నారు. ఉదయం 11 గంటలకు హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ఇందుకోసం వైఎస్సార్ సీపీ నేతలు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిపక్షాల వెన్నులో వణుకుపుట్టేలా సీఎం సభ ఉండాలని నేతలు భావిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్‌నిశ్చల్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం సీఎం జగన్ గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో హిందూపురానికి వెళ్తారు. అక్కడ సభ అనంతరం హెలికాప్టర్‌లో పలమనేరుకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొననున్నారు.

సీఎం హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన..
హిందూపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో గురువారం సాయంత్రం ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హెలిప్యాడ్ ఏర్పాటు కోసం ఎంజీఎం గ్రౌండ్‌ను పరిశీలించారు. ఎస్‌డీజీఎస్ కళాశాల గ్రౌండ్‌ను కూడా పరిశీలించి హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు. అధికారుల వెంట వైఎస్సార్ సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, కొల్లకుంట ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూంల పరిశీలన



పుట్టపర్తి స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్లు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూంలను సాధారణ ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, పోలీసు పరిశీలకులు ఇమ్నాలెన్నా పరిశీలించారు. గురువారం ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో ఈవీఎంలు, వీవీప్యాట్ భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత కదిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంను, అనంతరం పుట్టపర్తి పట్టణ పరిధిలోని వ్యవసాయ గోడౌన్‌లోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉండాలని, విధి నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈవీఎంలపై ఆయా పోలింగ్ స్టేషన్‌ల నంబర్లు అతికించాలన్నారు. వారి వెంట పుట్టపర్తి, కదిరి ఆర్‌ఓలు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, కదిరి తహసీల్దార్ పుల్లారెడ్డి, ఈడీటీ నరసింహులు, సెక్టార్ అధికారులు విజయ్ కుమార్, మహేష్, చంద్రమ్మ, బెల్ ఇంజినీర్ నిర్మలప్రియ తదితరులు ఉన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట భద్రత

- ఎస్పీ మాధవరెడ్డి



వానవోలు పోలింగ్ బూత్ వద్ద భద్రతా ఏర్పాట్లపై సీఐతో చర్చిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్/గోరంట్ల: జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పుట్టపర్తి మండలం నిడిమామిడి, రాచువారిపల్లి, పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లోని రౌడీషీటర్లు, సమస్యలు సృష్టించే వారి గురించి ఆరా తీశారు. ఎన్నికల వేళ ఎవరైనా ప్రజా జీవనానికి ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కలిస్తామన్నారు. ఎస్పీ వెంట సీఐ రాగిరి రామయ్య, ఎస్‌ఐ కృష్ణమూర్తి ఉన్నారు.


సరిహద్దుల్లో నిఘా పెంచండి..
రాష్ట్ర సరిహద్దులు, జిల్లా సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం ఆయన గోరంట్ల మండల పరిధిలోని వానవోలు, కమ్మలవాండ్లపల్లి, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు, పెరుమాళ్లపల్లి, వెంకటరమణపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి సీఐ సుబ్బరాయుడును ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బెస్తు యూనివర్సిటీ సమీపంలో కర్ణాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్నీ తనిఖీ చేసిన తర్వాతే పంపాలని, లిక్కర్, డబ్బు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కస్టడీకి బ్యాంకు మేనేజర్

అమడగూరు: వినియోగదారులకు తెలియకుండా వారి ఖాతాల్లోంచి నగదు అపహరించిన కేసులో అరెస్ట్ అయిన బ్యాంక్ మేనేజర్ పెంచలరెడ్డిని పోలీసులు విచారిస్తున్నారు. బ్యాంకు సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తూ ఖాతాదారులకు తెలియకుండా రూ 44.10 లక్షలను ఆయన స్వాహా చేశారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు గత నెల 28న చెన్నైలో నిందితుడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచిన పోలీసులు మూడు రోజుల పోలీసు కస్టడీ కింద తీసుకున్నారు. ఈ క్రమంలో గురువారం అమడగూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి బాధిత ఖాతాదారుల సమక్షంలో సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ మగ్బూల్‌బాషా విచారణ చేపట్టారు. ఇప్పటి వరకూ రూ.30 లక్షల వరకూ సొమ్ము తీసుకున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. విచారణ కొనసాగుతోందని, అక్రమాలు మరిన్ని వెలుగు చూసే అవకాశముందని పేర్కొన్నారు.

సత్యకుమార్ ఓసీనే!

- సోషల్ మీడియాలో విద్యార్హత పత్రాలు చక్కర్లు
- అందులో ఓసీగా పేర్కొన్న వైనం



సత్యకుమార్ అలియాస్ సత్యనారాయణరావు మదనపల్లెలో పాలిటెక్నిక్ కోర్సులో అడ్మిషన్ సర్టిఫికెట్‌లో ఓసీగా పేర్కొన్న దృశ్యం

ధర్మవరం: తనను తాను యాదవ్‌గా చెప్పుకున్న సత్యకుమార్ బీసీ సామాజిక వర్గానికి చెందిన వాడినంటూ ఇన్నాళ్లూ ధర్మవరం ప్రజలను మోసం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీసీలను వంచించారు. కానీ సత్యకుమార్ చదువుకున్న సమయంలో ఓసీ అని పేర్కొన్న సర్టిఫికెట్లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

బీసీ ఓట్ల కోసం గాలం..
ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ తాను బీసీనంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసుకున్నారు. బీసీ సంఘాలతో ఆత్మీయ సమావేశాలు పెట్టి బీసీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. అలాగే తాను యాదవుడినని చెబుతూ ఆ సామాజికవర్గం ఓట్ల కోసం వల వేశారు. ఎన్నికల సంఘానికి ఇచ్చిన అఫిడవిట్‌లో సైతం క్యాస్ట్ కాలంలో బీసీ అని మాత్రమే పొందుపరిచారు. తన సామాజికవర్గానికి సంబంధించిన వివరాలు వెల్లడించకపోవడంతో అందరికీ అనుమానాలు తలెత్తాయి.

బండారం బట్టబయలు..
సత్యకుమార్ బండారం సోషల్ మీడియా వేదికగా బట్టబయలైంది. సత్యకుమార్ విద్యాభ్యాసం చేసిన ప్రొద్దుటూరు, మదనపల్లెలో చదివిన విద్యా సంస్థల్లో ఆయన సర్టిఫికెట్లలో ఇండియన్ మరాఠా (ఓసీ)గా పేర్కొన్నారు. ఆ ధ్రువీకరణ పత్రాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ధర్మవరం వాసులు విస్తుపోతున్నారు.

అసలు పేరు సత్యనారాయణరావు..
వాస్తవానికి మహారాష్ట్ర మరాఠా కుటుంబానికి చెందిన సత్యకుమార్ అసలు పేరు సత్యనారాయణ రావు, ఆయన తండ్రిపేరు నాగరాజరావు. వీరు ఓసీలు. ఈ విషయం ఆయన విద్యార్హత ధ్రువీకరణ పత్రాల్లో ఉంది. ఇవన్నీ ప్రజలకు తెలియవన్నట్లుగా ఆయన బీసీగా చెబుతూ రాజకీయ లబ్ధి పొందాలని చూడటం విస్మయాన్ని కల్గిస్తోంది.



హిందూపురం ఎస్‌బీఐ వద్ద మండుటెండలో వృద్ధుల అవస్థ



హిందూపురం ఏపీజీబీ వద్ద బారులు తీరిన పింఛన్‌దారులు



నల్లచెరువులో వృద్ధులు, దివ్యాంగుల అగచాట్లు



హిందూపురం యూనియన్ బ్యాంకులో కిక్కిరిసిన వృద్ధులు



మడకశిర ఎస్‌బీఐ సీఎస్‌పీ సెంటర్ ఎదుట కూర్చున్న వృద్ధులు

మాపై ఎందుకంత కక్ష బాబూ?

చంద్రబాబు నిర్వాకంతో వలంటీర్ల సేవలు దూరం కాగా, పింఛన్ కోసం పండుటాకులు పడరాని పాట్లు పడుతున్నారు. మండుటెండలో బ్యాంకుల వద్ద బారులు తీరారు. గంటల తరబడి నిల్చోలేక అల్లాడిపోయారు. మాపై ఎందుకు ఇంత కక్ష బాబూ అంటూ శాపనార్థాలు పెట్టారు. గురువారం జిల్లాలోని ఏ బ్యాంకు వద్ద చూసినా పింఛన్‌దారులే కనిపించారు. – సాక్షి నెట్‌వర్క్

మీకు ఓటు అడిగే అర్హతే లేదు

- చంద్రబాబు నిర్వాకం వల్లే మాకు అవస్థలు
- టీడీపీ నాయకులపై పింఛన్‌దారుల ఆగ్రహం



టీడీపీ నాయకులను నిలదీస్తున్న పింఛన్ దారులు

నల్లచెరువు: ''ప్రతి నెలా 1వ తేదీ ఇంటికే వచ్చే పింఛన్ రాకుండా చేశారు. మేమిప్పుడు ఎర్రటి ఎండలో పడరానిపాట్లు పడుతుంటే.. మమ్మల్ని వచ్చి ఓటు అడుగుతున్నారు. మీకు మనసన్నదే లేదా..ఏ ముఖం పెట్టుకుని వచ్చారు'' అంటూ టీడీపీ నేతలపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నల్లచెరువులో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా బ్యాంకు వీధిలో పింఛన్ కోసం ఎర్రటి ఎండలో నిరీక్షిస్తున్న వృద్ధుల వద్దకు వెళ్లి చంద్రబాబుకు ఓటు వేయాలని కోరారు. దీంతో పలువురు వృద్ధులు, దివ్యాంగులు టీడీపీ నాయకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ఇంటి పెద్ద కొడుకులా ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే వలంటీర్‌ను ఇంటికే పంపి పింఛన్ సొమ్ము అందేలా చూశారు. కానీ మీ చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం వలంటీర్ల సేవలు ప్రజలకు అందకుండా చేశారు. చంద్రబాబు ఘనకార్యం వల్లే మేమంతా మండుటెండలో పింఛన్ కోసం బ్యాంకుల ఎదుట నిలబడాల్సి వచ్చింది' అని మండిపడ్డారు. తమను ఇంతలా ఇబ్బంది పెడుతున్న చంద్రబాబుకు ఓటు వేయాలని ఎలా అడుగుతున్నారంటూ నిలదీశారు. దీంతో టీడీపీ నాయకులు అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత కట్టుదిట్టం చేయండి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

మడకశిర: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మడకశిర ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలను భద్రపరచిన గదులను పరిశీలించారు. భద్రతా చర్యలు, ఎన్నికల నిర్వహణపై స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. కలెక్టర్ వెంట పెనుకొండ సబ్ కలెక్టర్, అపూర్వ భరత్, స్థానిక అధికారులు ఉన్నారు.

దాడులకు టీడీపీ ప్లాన్



కొట్లపల్లిలో ఘర్షణకు దిగిన టీడీపీ నాయకులు



పోలీసుల రాకతో వెళ్లిపోతున్న టీడీపీ నాయకులు

- ఎమ్మెల్యే దుద్దుకుంట రోడ్‌షోను అడ్డుకునే ప్రయత్నం
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన రగడ

పుట్టపర్తి అర్బన్: ఓటమి భయంతో టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు సిద్ధమయ్యారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు రేపుతున్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి అండతో దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. గురువారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కొట్లపల్లి, ఎస్సీ కాలనీ, సూరగానిపల్లి, ఇరగరాజుపల్లి గ్రామాల్లో రోడ్ షో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలూ ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు సమాయత్తమయ్యారు. ఉదయం ఇరగరాజుపల్లికి వెళ్లడానికి ప్రత్యేక వాహనాల్లో ఎమ్మెల్యే పుట్టపర్తి నుంచి బయలుదేరారు. అయితే ఇరగరాజుపల్లికి 4 కిలోమీటర్ల దూరంలోనే టీడీపీ నాయకులు కార్లు అడ్డుపెట్టారు. ఎమ్మెల్యే కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులూ ఎదురుదాడికి దిగడంతో తోక ముడిచారు.

రెచ్చగొట్టి.. రచ్చచేసి
ఇరగరాజుపల్లికి పల్లె రఘునాథరెడ్డి వస్తున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఒకే గ్రామంలో రెండు పార్టీల వారి రోడ్‌షోల వద్ద ప్రజలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని భావించారు. ఈక్రమంలోనే ఆయన కొట్లపల్లికి వెళ్లి రోడ్ షో ప్రారంభించేందుకు సమాయత్తమయ్యారు. అయితే ఇరగరాజుపల్లి నుంచి వచ్చిన కొంతమంది టీడీపీ కార్యకర్తలు కొట్లపల్లి ప్రధాన రహదారిపై సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్ సీపీ శ్రేణులను చూసి కవ్వింపు చర్యలకు దిగారు. టీడీపీ జెండాలు పట్టుకొని వాహనాల్లో తిరుగుతూ రెచ్చగొట్టారు. గ్రామస్తులు తిరగబడే సరికి కొంత సేపు వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లాఠీలకు పనిచెప్పి అల్లరిమూకలను చెదరగొట్టారు. దీంతో రగడ సద్దుమణిగింది. అయినప్పటికీ పోలీసులు ఇరగరాజుపల్లిలో పికెట్ ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

నాటు సారా స్థావరంపై దాడులు

కంబదూరు: మండలంలోని పాళ్లూరు గ్రామ పొలాల్లో ఉన్న నాటు సారా తయారీ స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. 1000 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. తయారీ దారుడి నుంచి 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

రోబోటిక్ సర్జరీపై వైద్య విద్యార్థులకు అవగాహన

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం రోబోటిక్ సర్జరీపై వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ మహమ్మద్ షాహిద్ రోబోటిక్ సర్జరీ ద్వారా కలిగే ప్రయోజనాలను విపులంగా తెలియజేశారు. శస్త్రచికిత్సలు ఎంత సులభంగా చేయవచ్చో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వెన్నెముక, యురాలజీ, గైనకాలజీ, అన్ని రకాల కేన్సర్లకు రోబోటిక్ పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ.. డాక్టర్ షాహిద్ వైద్య కళాశాల 2K8 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి అని, నారాయణ హృదయాలయలో జనరల్ సర్జరీ, హైదరాబాద్‌లోని ఏషియన్ గ్యాస్ట్రోఎంటరాలజీలో గ్యాస్ట్రోఎంటరాలజీ పూర్తి చేశారన్నారు. బిరియాట్రిక్ సర్జరీ, రోబోటిక్ సర్జరీలపై ఫెలోషిప్ పొంది విద్యనభ్యసించిన కళాశాలలోనే గెస్ట్ లెక్చర్ ఇవ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు, ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ వేముల శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ నవీన్, ప్రొఫెసర్లు డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ రామస్వామి, డాక్టర్ శివశంకర్ నాయక్, డాక్టర్ సుచిత్రశౌరి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

విత్తన నాణ్యతకు పెద్దపీట

- ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అందుబాటులోకి వ్యవసాయ ప్రయోగశాలలు
- రూ.11.70 కోట్లతో అధునాత సాంకేతిక ల్యాబ్‌ల నిర్మాణం
- రైతుల ముంగిటకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర ఇన్‌పుట్స్


గుత్తిలో ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ ల్యాబ్

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయం లాభసాటి కావాలంటే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర ఇన్‌పుట్లను అందజేయాలనే సమున్నత ఆశయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలోనూ 'ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్స్' ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కల్తీ, నాసిరకం ఉత్పత్తులకు చెక్ పెట్టడానికి వీలుగా 'వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్' శరవేగంగా అందుబాటులోకి తెచ్చారు. అధునాతన సాంకేతిక పద్ధతిలో ఏర్పాటు చేసిన ఒక్కో ల్యాబ్‌కు రూ.97.50 లక్షలు ఖర్చు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 12 నియోజక వర్గాల పరిధిలో వ్యవసాయ ప్రయోగశాలలు పనిచేస్తున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ప్రయోగశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాప్తాడు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో అగ్రి ల్యాబ్స్ అందుబాటులోకి వచ్చాయి. అనంతపురం జిల్లా స్థాయి ల్యాబ్ పరిధిలో రాప్తాడుకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి ల్యాబ్‌లో ఓ టెక్నికల్ ఏఓ, ఇద్దరు ఏఈఓలు, మరొక అసిస్టెంట్‌ను కేటాయించారు. 12 ప్రయోగశాలల నిర్మాణానికి రూ.11.70 కోట్లు బడ్జెట్ ఖర్చు చేయగా, నియోజకవర్గ, జిల్లా స్థాయితో పాటు విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ స్థాయి ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాలు రైతులు, దుకాణాదారులు, కంపెనీల నుంచి సేకరించి వాటి నాణ్యతను పరీక్షిస్తున్నారు. ప్రధానంగా మొలకశాతం, తేమశాతం, ఫిజికల్ ప్యూరిటీ అలాగే ఎన్–పీ–కే పోషకాల శాతం, జింక్, బోరాన్, మెగ్నీషియం లాంటి సూక్ష్మపోషకాల శాతాన్ని పరీక్షిస్తున్నారు. అలాగే పురుగు మందులు, బయో ఉత్పత్తులు, సేంద్రియ ఉత్పత్తులు, మట్టి, నీరు పరీక్షలు కూడా చేస్తూ కల్తీ, నాసిరకానికి అడ్డుకట్ట వేస్తున్నారు.

అప్పట్లో నాసిరకంతో నష్టాలపాలు..

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన ప్రయోగశాలలు అందుబాటులో లేని రోజుల్లో బహిరంగ మార్కెట్‌లో నాసిరకం, కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు హల్‌చల్ చేశాయి. 2014–19 మధ్య ఐదేళ్ల కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అందించిన విత్తనాలకు సంబంధించి 70కు పైగా నమూనాలు సేకరించిన అధికారులు పరీక్షల అనంతరం అవి నాసిరకమని తేల్చారు. అలాగే 45 వరకు ఎరువుల నమూనాలు, 60కు పైగా పురుగు మందుల నమూనాలు కూడా నాణ్యతగా లేవని తేల్చారు. ఇలాంటి ఉత్పత్తులతో పంటల సాగు చేపట్టిన రైతులు భారీగా నష్టపోయారు. ఇందుకు సంబంధించి అక్కడక్కడ కొన్ని కేసులు నమోదవుతున్నా... నిబంధనల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకుని కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, దుకాణాదారులు గట్టెక్కుతున్నారు. పంట సాగు చేసిన రైతుకు మాత్రం అన్యాయం జరుగుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... విత్తన వరి, వేరుశనగ, పప్పుశనగ, కందులు, అలాగే పండ్లు, కూరగాయలు, కర్బూజా, కళింగర లాంటి ఉద్యానతోటలకు సంబంధించి విత్తనాలు కూడా నాణ్యమైన సరఫరా చేసేలా పటిష్ట చర్యలు తీసుకున్నారు.


వేరు చేసిన నాసిరకం విత్తన కాయలు

చేతకాకపోతే తప్పుకోండి

- ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించిన డ్వామా పీడీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ విజయప్రసాద్

రొద్దం: కూలీల సంఖ్య పెంచడం చేతకాకపోతే విధుల నుంచి తప్పుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లను డ్వామా పీడీ విజయప్రసాద్ హెచ్చరించారు. రొద్దం మండలం బొక్సంపల్లి వద్ద గురువారం చేపట్టిన ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమై మాట్లాడారు. ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యం మరింత పెరగాలని పదే పదే చెబుతున్నా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిబ్బందిపై మండిపడ్డారు. ఉపాధి పనుల కల్పనలో జిల్లాలోనే రొద్దం మండలం చివరి స్థానంలో ఉందన్నారు. సోమవారం నుంచి కూలీల సంఖ్య పెంచాలని, లేకపోతే విధుల నుంచి తప్పుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏపీఓ అనిల్‌కుమార్, ఈసీ శివ పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్స్ లారీ బోల్తా


లారీ బోల్తాపడటంతో కిందపడిపోయిన కూల్‌డ్రింక్స్ బాటిళ్లు

చిలమత్తూరు: కూల్‌డ్రింక్స్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన చిలమత్తూరు మండలం కనిశెట్టిపల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి మ్యాంగో ఫ్రైస్ కూల్‌డ్రింక్స్ లోడుతో తమిళనాడు రాష్ట్రం హొసూర్‌కు వెళ్తున్న లారీ కనిశెట్టిపల్లి వద్ద 44వ జాతీయరహదారిపై అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన డ్రైవర్‌ను బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీలోను, కిందపడిన కూల్‌డ్రింక్ బాటిళ్లను వాహనదారులు, స్థానికులు తీసుకెళ్లారు. పోలీసులు వచ్చేసరికి లారీలో సరుకంతా ఖాళీ అయిపోయింది.

బిడ్డకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

బొమ్మనహాళ్: తాను చనిపోతే తన బిడ్డ బాగోగులు చూస్తారో లేదోనన్న ఆవేదనతో క్షణికావేశానికి లోనైన ఓ తల్లి తన బిడ్డకు విషమిచ్చి తానూ తాగింది. చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందాడు. తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... బొమ్మనహాళ్ మండలం కల్లుదేవనహళ్లి గ్రామానికి చెందిన చాకలి తిప్పయ్య కుమార్తె అశ్విని (23)కి ఆరేళ్ల క్రితం డి.హీరేహాళ్ మండలం మురిడి గ్రామానికి చెందిన చాకలి రామాంజినేయులుతో వివాహమైంది. వీరికి 18 నెలల వయసున్న కుమారుడు శశాంత్ ఉన్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న అశ్వనికి కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో తాను చనిపోతే తన కుమారుడి బాగోగులు పట్టించుకుంటారో లేదోననే అనుమానాలు ఆమెను తీవ్రంగా కలచి వేశాయి. దీంతో గత నెల 30న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమారుడికి విషమిచ్చి, తానూ పురుగుల మందు తాగింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే వారిని బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం శశాంత్ మృతి చెందాడు. అశ్విని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


జీషన్ మృతదేహం

గుంతకల్లు రూరల్: నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు... గుంతకల్లులోని కసాపురం రోడ్డు సమీపంలో ఉన్న బెస్త కాలనీలో నివాసముంటున్న మహబూబ్ దౌలా, రమీజా దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తెతో పాటు నాలుగేళ్ల వయసున్న కుమారుడు జీషన్ ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా మహబూబ్ దౌలా, గార్మెంట్ షాపులో కార్మికురాలిగా రమీజా పనిచేస్తే కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం ఉదయం ఇంటి ఆవరణలో ఉన్న సంపుపై మూతను రమీజా తొలగించి నీటిని తోడుకున్న అనంతరం పనికి వెళ్లే తొందరలో సంపుపై మూత పెట్టడం మరిచిపోయింది. ఆ సమయంలో అక్కతో కలసి ఆడుకుంటున్న జీసన్ ప్రమాదవశాత్తు సంపులో పడ్డాడు. గమనించిన అక్క వెంటనే పరుగున వెళ్లి తండ్రికి తెలపడంతో ఆయన వచ్చి సంపులో దిగి నీట మునిగిన కుమారుడిని వెలికి తీశారు. అపస్మారక స్థితికి చేరుకున్న జీషన్‌ను వెంటనే తన ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

వాహనం ఢీ - యువకుడి మృతి


మృతుడు భాస్కర్

మడకశిర: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర పట్టణ సమీపంలోని చౌటిపల్లికి చెందిన భాస్కర్(22) బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పనిపై ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి 11 గంటల సమయంలో కుటుంబసభ్యులు ఫోన్ చేసి మాట్లాడారు. ఇంటికి వస్తున్నట్లుగా తెలిపిన భాస్కర్ ఎంత సేపటికీ చేరుకోలేదు. దీంతో మరోసారి కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున చౌటిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై వెళ్లిన స్థానికులు అక్కడ రోడ్డుపై పడి ఉన్న భాస్కర్ మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బావిలో పడి యువకుడి మృతి


మృతుడు సాయినాథరెడ్డి

తలుపుల: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తలుపుల మండలం బురుజుపల్లికి చెందిన బ్రహ్మానంద రెడ్డి కుమారుడు సాయినాథరెడ్డి (23) బుధవారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలసి ఉబ్బరవాండ్లపల్లి సమీపంలోని బావి వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. బావిలోకి దూకగానే సాయినాథరెడ్డికి ఫిట్స్ వచ్చి నీట మునిగిపోయాడు. లోతుగా ఎక్కువగా ఉండడంతో కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. చీకటి పడడంతో సాధ్యం కాక వెనుదిరిగారు. గురువారం ఉదయం బావి వద్దకు చేరుకోగానే నీటిలో సాయినాథరెడ్డి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

'వైఎస్సార్‌సీపీకే మా మద్దతు'

అనంతపురం: రాయలసీమ పురోభివృద్ధికి బాటలు వేస్తున్న వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ (ఆర్‌యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి తెలిపారు. శ్రీ బాగ్ ఒప్పందం మేరకు అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆదరించాలని పిలుపునిచ్చారు. రాయలసీమకు న్యాయ రాజధానితో పాటు నీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ప్రశంసించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ప్రెస్ క్లబ్‌లో జరిగే రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ ప్రతినిధుల సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుని ఆ మేరకు ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

మరో పది రోజులే గడువు

- ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- బరిలో అసెంబ్లీ స్థానానికి 91 మంది, పార్లమెంట్‌కు 13 మంది


ఈవీఎంల ర్యాండమైజేషన్ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: మరో పది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల కీలక ఘట్టం మొదలు కానుంది. ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జిల్లాలో నూతన ఓటర్లుగా 26,026 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, వీటిని అధికారులు ఆమోదించారు. అలాగే ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధాఇంచి ఫారం–7 కు 27,705, ఫారం–8కు 12,166 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆమోదించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,56,775 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 7,11,048 మంది, మహిళలు 8,32,651 మంది, ఇతరులు 76 మంది ఉన్నారు. 1,852 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి, 256 రూట్లుగా విభజించారు.

పోస్టల్ బ్యాలెట్లు సిద్ధం..

జిల్లాలో ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది, అత్యవసర సేవలు అందించే వారు ఓటు హక్కు వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్లను అధికారులు సిద్ధం చేశారు. ఈసారి కొత్తగా దివ్యాంగులు, 85 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించారు. ఈ క్రమంలో ఇతర జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్లు 3,560 ఉండగా, జిల్లాకు చెంది మరో 15,500 మందికి పైగా తమకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. 500 మంది వయో వృద్ధులు, 526 మంది దివ్యాంగులకూ హోం ఓటింగ్ సౌకర్యం కల్పించనున్నారు.

పోటీలో 104 మంది అభ్యర్థులు..

వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్రులు ఈ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేశారు. హిందూపురం పార్లమెంట్ స్థానానికి 40 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ ముగిసి చివరకు 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 231 నామినేషన్లు దాఖలు కాగా, చివరకు 91 మంది బరిలో మిగిలారు.

కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం..

అత్యంత భద్రత మధ్య ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు లేపాక్షి సమీపంలోని గురుకుల పాఠశాలను ఎంపిక చేశారు. అలాగే మడకశిర, హిందూపురం, పెనుకొండ, కదిరి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు హిందూపురం మండలం మలుగూరు సమీపంలోని బీఐటీ కళాశాలను సిద్ధం చేశారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపును అనంతపురంలోని జేఎన్‌టీయూ కళాశాలలో చేపట్టనున్నారు.

పోలింగ్ ఏజెంట్ల పాత్ర కీలకం

- దొంగ ఓటర్లను సులువుగా గుర్తు పట్టేస్తారు
- ఏజెంట్లుగా స్థానికులకే అవకాశం

పుట్టపర్తి టౌన్/ హిందూపురం అర్బన్ : ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరపున ఓటరు పరిశీలనలో ఏజెంట్ల పాత్ర కీలకంగా ఉంటోంది. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఏజెంట్లు కూర్చొనేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ప్రతి అభ్యర్థి తరపున ఒక పోలింగ్ ఏజెంటు, ఇద్దరు రిలీవర్లను ఏర్పాటు చేసుకోవచ్చు. వీరికి ఏజెంట్ పాసు జారీ చేస్తారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి మూడు పాసులు జారీ చేసినా ఒకరు మాత్రమే బూత్‌లో కూర్చోవడానికి అనుమతి ఇస్తారు. పార్టీ కండువాలు, గుర్తులను ధరించరాదు. ఓట్లు వేయని ఓటర్ల సంఖ్యను సూచించి వెలుపలికి చీటీలను పంపడం కూడా నిషేధం.

విశ్వాసపాత్రులకే అవకాశం..

పోలింగ్ బూత్ ఏజెంట్లుగా తమకు విశ్వాసంగా ఉండే వారినే రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎంపిక చేస్తుంటారు. దానికి అనుగుణంగా వారు సైతం దొంగ ఓటర్లను సులువుగా గుర్తించి ఓటింగ్‌ను అడ్డుకుంటారు. పోలింగ్ బూత్‌లో ఏజెంట్ నిర్ధారించిన తర్వాతనే ఓటు వేసేందుకు ఓటరును అధికారులు అనుమతిస్తారు.

ఏజెంట్‌ను ఇలా నియమించుకోవచ్చు:


ఎన్నికల బరిలో ఉన్న రాజకీయ అభ్యర్థి తరపున పోలింగ్ బూత్ ఏజెంట్‌గా ఉండాలనుకునే వారు తొలుత వారి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో పాటు ఓటరు జాబితాలోని సీరియల్ నంబర్ వేసి పార్టీ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ నుంచి అనుమతి వచ్చిన తర్వాత ఎన్నికల అధికారులకు దరఖాస్తు అందజేస్తారు. పరిశీలన అనంతరం పోలింగ్ బూత్ ఏజెంట్‌గా వ్యవహరించేందుకు అధికారులు అనుమతిస్తూ ఓ గుర్తింపు కార్డును జారీ చేస్తారు. ఓ పోలింగ్ బూత్‌కు సంబంధించి ఏజెంట్‌గా నియమితులైన వారు మరో బూత్‌లో కూర్చొనేందుకు వీలుండదు.

అర్హతలు ఇవే..

పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరించే వ్యక్తి ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరుగా ఉండాలి. పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయడానికి వచ్చే వారిని గుర్తించడానికి మాత్రమే వారికి అవకాశం ఉంటుంది. అంతకు మించి ఎలాంటి ప్రత్యేక అధికారాలు ఉండవు. ఏజెంట్‌గా నియమితులైన వారు ఎలాంటి ప్రచారాలు చేయకూడదు. ఏదైనా పార్టీ తరపున ప్రచారం చేసినట్లు పోలింగ్ సిబ్బంది గమనిస్తే ముందుగా హెచ్చరించి బూత్ నుంచి బయటకు పంపిస్తారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- క్షేత్రస్థాయిలో పర్యటించి చికిత్సలు అందించండి
- డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి


వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న డాక్టర్ మంజువాణి

మడకశిర రూరల్: గ్రామీణ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పీఎస్ మంజువాణి సూచించారు. గురువారం ఆమె నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లతో సమావేశమై మాట్లాడారు. వైద్య చికిత్సల నిర్వహణ, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. చికిత్స కోసం పీహెచ్‌సీలకు వస్తున్న వారికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ఎవరైనా వ్యాధులతో బాధపడుతుంటే చికిత్స అందజేయాలన్నారు. ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రస్తుత రోజుల్లో బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలు 11 గంటల తర్వాత బయటికి రాకుండా అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.

ఇద్దరి దుర్మరణం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఐచర్
- మృతులు తమిళనాడు వాసులు


మృతులు విజయ్ శివలింగ, తమిళమారన్

పెనుకొండ రూరల్: లారీని వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. కియా ఎస్ఐ రంగడు తెలిపిన మేరకు... హైదరాబాద్ నుంచి తమిళనాడులోని తిరువన్నూరు జిల్లా తాళంపల్లె తాలూకా, సిలుకై గ్రామానికి బయలుదేరిన ఐచర్ వాహనం గురువారం తెల్లవారుజామున శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ రూరల్ పరిధిలోని గుట్టూరు కనుమ వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ఎదురుగా మరమ్మతులకు లోనై ఆగి ఉన్న సిమెంట్ లారీని ఢీకొంది. ఘటనలో ఐచర్ వాహన డ్రైవర్ విజయ్ శివలింగ(29), ఆయన మేనల్లుడు తమిళమారన్ (11) తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందేలోపు విజయ్ శివలింగ మృతి చెందాడు. ప్రథమ చికిత్స అనంతరం తమిళమారన్‌ను బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భర్త చేతిలో భార్య హతం


వనిత మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హిందూపురం అర్బన్: అనుమానం పెనుభూతమై భర్త చేతిలో భార్య హతమైంది. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న వనిత (45), విజయ్‌కుమార్ దంపతులకు బీటెక్ చదువుతున్న కుమార్తె విఖిత ఉంది. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న విజయ్‌కుమార్ తరచూ ఆమెతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం దంపతులిద్దరూ తీవ్ర స్థాయిలో ఘర్షణ పడ్డారు. అనంతరం అనంతపురంలోని కళాశాల హాస్టల్ ఉంటూ చదువుకుంటున్న కుమార్తె విఖితకు తల్లి ఫోన్ చేసి విషయం తెలిపింది. మధ్యాహ్న సమయంలో విఖితకు విజయ్‌కుమార్ ఫోన్ చేసి 'మీ అమ్మ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది' అని తెలిపి ఫోన్ కట్ చేశాడు. దీంతో ఆమె ఆగమేఘాలపై ఇంటికి చేరుకుంది. అప్పటికే పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. వనిత గొంతు నులిమి హతమార్చినట్లుగా ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విఖిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రియాజ్ అహమ్మద్ తెలిపారు.

క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామ లేఖలను అందిస్తున్న గంగంపల్లి పంచాయతీ వలంటీర్లు

గోరంట్ల: మండలంలోని గంగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 17 మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామలేఖను ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. పేదలకు మంచి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటేయండి

అమడగూరు: ఈ నెల 13 వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ప్రజలను కోరా. గురువారం తలమర్లపల్లి, కరిమిరెడ్డిపల్లి, మద్దెమ్మ గుడిపల్లి, దూదరగుట్ట, దాదెంవారిపల్లి తండా, లోకోజుపల్లి, గోపాల్‌నాయక్ తండాలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవిత శివశంకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మల్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, రవి, వెంకటరమణ నాయక్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'దుద్దుకుంట' రోడ్ షో

కొత్తచెరువు: మండలంలోని పోతులకుంట, తలమర్ల గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భారీ రోడ్ షో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండ, చంద్రగిరి, కురుబవాండ్లపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని జోరుగా చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నకేశవులు, రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి

పుట్టపర్తి టౌన్: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండాలని పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సమాధి రోడ్డు, చిత్రావతి రోడ్డు ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్, కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ కార్యక్రమంలో ఎస్ఐ మధుచంద్రుడుతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

సోమందేపల్లి: మండలంలోని వెలుగుమాకులపల్లి, ఈదుళబలాపురం చల్లాపల్లి, సోమందేపల్లి గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పెనుకొండ డీఎస్పీ షేక్ బాజీ జాన్ సైదా గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ యుగంధర్, ఎస్ఐ విజయ్ కుమార్‌లకు సూచించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన రామాంజినేయులు

రొద్దం: మండల పరిధిలోని శేషాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రామాంజినేయులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం మండల బూదిపల్లి, కలిపి, శేషాపురం గ్రామాల్లో నాయకులు ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషమ్మను, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటా వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు బి.నారాయణరెడ్డి, శివరాజు, సి.నారాయణరెడ్డి, నరేంద్ర, ఎన్.నారాయణరెడ్డి, శేషు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోను నమ్మితే నట్టేట మునిగినట్టే



కొట్లపల్లిలో రోడ్‌షో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



చారుపల్లి రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: టీడీపీ మేనిఫెస్టోను నమ్మితే నట్టేట మునిగినట్టేనని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కొట్లపల్లి, ఎస్సీ కాలనీ, సూరగానిపల్లి గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు ప్రజలు పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఒక్క సంక్షేమ పథకాన్నీ అమలు చేయకుండా, రూ.లక్షల కోట్లు బకాయిలు పెట్టి తమ ఖజానాలను నింపుకున్న గజదొంగలు ఈ చంద్రబాబు, పల్లె అన్నారు. 2014 ఎన్నికల్లో 600లకు పైగా హామీలచ్చిన చంద్రబాబు వాటిని అమలుచేయకుండా ప్రజలను మోసగించారన్నారు. ఇప్పుడు కూడా ఆచరణ సాధ్యం కాని హామీలను మోసగించడానికి వస్తున్నాడన్నారు. టీడీపీ నాయకులు ప్రచారానికి వస్తే పాత బకాయిలు చెల్లించి ఆ తర్వాత సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని గట్టిగా నిలదీయాలన్నారు. చంద్రబాబు వస్తే ఆయన వెంటే కరువు వస్తుందన్నారు. గతంలో ఏళ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడి, చీనీ తోటలు నిలువునా ఎండి పోయాయని, పంటలు పండక వలసలు వెళ్లడంతో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయన్నారు. గత హామీలను అమలు చేయని సన్నాసులు ఏ ముఖం పెట్టుకొని ఆంధ్రాకు వస్తున్నారో చెప్పాలన్నారు.

193 చెరువులను కృష్ణాజలాలతో నింపుతాం

ఎన్నికలు పూర్తి కాగానే 193 చెరువుల ద్వారా కృష్ణా జలాలతో నింపుతామని ఎమ్మెల్యే ప్రకటించారు. భవిష్యత్తులో పుట్టపర్తి నియోజకవర్గం సుభిక్షంగా ఉంటుందని, ఈనెల 13న ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనతోపాటు, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. సంక్షేమ ప్రభుత్వం రాగానే వలంటీర్ల ద్వారా జూలైలో పింఛన్ మొత్తం ఇంటికే వస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు.

చంద్రబాబు, కరువు కవల పిల్లలు

నల్లమాడ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, కరువు కవల పిల్లలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. చారుపల్లి పంచాయతీలోని సీ.రెడ్డివారిపల్లి, చారుపల్లి, సీ.బడవాండ్లపల్లి, పోలంవాండ్లపల్లిలో గురువారం ఎమ్మెల్యే రోడ్ షో చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబు హయాంలో 2014 నుంచి 2019 వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని మోతుబరి రైతులు కూడా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి నానా కష్టాలు పడ్డారని గుర్తుచేశారు. జగనన్న వచ్చాక రాష్ట్రంలో సమృద్ధిగా వానలు కురిసి, పంటలు రైతులు, రైతు కూలీలు సంతోషంగా ఉన్నారన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, ఆయన మాయ మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే టీడీ నాగరాజారెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, ఎస్టీ విభాగ జోనల్ ఇన్‌చార్జ్ దుంగావత్ రమేష్‌నాయక్, మండల పార్టీ పరిశీలకులు బీఆర్ కేశప్ప, మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటనారాయణరెడ్డి, డీలర్లు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, నాయకులు బయపరెడ్డి, సాతర్ల రామచంద్ర, శంకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మహిళా సాధికారత



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళల పేరుమీద అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని మంత్రి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండలంలోని గుంతపల్లి సమీపంలోని నిషా గార్మెంట్స్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం మంత్రి ఉషశ్రీచరణ్ మహిళలతో సమావేశం నిర్వహించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ జగనన్న పాలన మహిళ లోకానికి స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. అమ్మఒడి ఇస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు.. ఎన్నికల వేళ ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు ఎలా ఇస్తామన్నారో చెప్పాలన్నారు. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న జగనన్నకు పట్టంకడితే మరింత మేలుచేస్తారన్నారు. కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

గోరంట్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని రాష్ట్ర స్త్రీ,శిశుసంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గంగంపల్లి, కమ్మవారిపల్లి , గౌనివారిపల్లి, మలసముద్రం, కొండాపురం, పులేరు, వెంకటరమణపల్లి, బూదిలి, గ్రామ పంచాయతీలో బూత్ కమిటీ ,పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల్లో అనుసరించాల్సి విధివిధానలపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పార్టీ విజయంలో కార్యకర్తలే కీలకమన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయం కోసం పనిచేయాలని కోరారు. ఆయా గ్రామాల్లోని పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఈవీఎంపై ప్రతి ఓటరుకూ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని పార్టీ ముఖ్యనాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, బూత్‌కమిటీ కన్వీనర్లు , కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన జైసాయి తదితరులతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: పట్టణంలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. టీడీపీలో కీలకంగా ఉన్న జైసాయి తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి గురువారం పుట్టపర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రామమోహన్, సత్తి, రమాదేవి, వెంటలక్ష్మి, సునీత, వినయ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరందరికి శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్,ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేపట్టి అభివృద్ధి,సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు.

చంద్రబాబు హామీలు నమ్మొద్దు



తంగేడుకుంటలో ప్రచారం చేస్తున్న కిషన్‌రెడ్డి



కొత్తచెరువు మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ఓడీచెరువు: చంద్రబాబు బూటకపు హామీలు నమ్మొద్దని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. తంగేడుకుంట, మద్దకవారిపల్లి, బుచ్చిరాజుపల్లి, అరకుబావిపల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ రాజు నాయుడు, జెడ్పీటీసి కుర్లి దామోదర్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనందరెడి, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకట రంగారెడ్డి, బాబుస్వామి,రఫి, సర్పంచు అభిదా, ఎంపీటీసీ రమణ, సుధాకర్ రాయల్, మధు, సనత్ స్వామి, చింతా వెంకటేష్, డీలర్ బాలు పాల్గొన్నారు.

కొత్తచెరువు: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే బావమరిది రాఘవరెడ్డి ప్రజలను కోరారు. కదిరేపల్లి, బండమీదపల్లి, నారేపల్లి, మైలసముద్రంలో ఆయన నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి,పరిశీలకులు ఆవుటాల రమణారెడ్డి,సర్పంచ్‌లు ప్రకాష్,ఇందిరమ్మ,కేశాపురం నరేంద్రరెడ్డి డాక్టర్ నరసింహరెడ్డి, గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు నారేపల్లి సంజీవరెడ్డి, అశోక్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, లింగమయ్య, మీర్జాపురం పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం బుక్కపట్నం మండలం జానకంపల్లిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్దన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గండ్లూరి ప్రభాకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ కృష్ణారెడ్డి, పుటికిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, సీనియర్ నాయకులు క్రాంతికుమార్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మధు, జానకంపల్లి యూత్, నారాయణస్వామి పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డు బీడుపల్లి గ్రామంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు మున్సిపాలిటీ పరిశీలకులు రఘునాథరెడ్డి, నాయకులు గోపీనాథ్‌రెడ్డి బాలగంగిరెడ్డి, నాగభూషణ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జానకంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



బీడుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

శ్రీధర్‌రెడ్డిని గెలిపించుకుందాం



ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

నల్లమాడ: మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించుకుందామని ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ఓటర్లను కోరారు. పాతబత్తలపల్లి పంచాయితీలోని కమ్మవారిపల్లి, స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శ్రీ సత్యసాయి జిల్లాకు, మూడు జాతీయ రహదారులు, 193 చెరువులు నింపేందుకు అవసరమైన నిధులు సాధించారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీగా బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సర్పంచ్ మాసే రెడ్డెమ్మ, ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, ఎంపీటీసీ రాధయ్య, మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, మహిళా కార్యదర్శి దేశాయి భారతీ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఉమారాజు, నాయకులు నరసింహమూర్తి, పీ. రామకృష్ణారెడ్డి, కొక్కంటి శ్రీనివాసరెడ్డి, ఆర్ఎవీ హరినాథరెడ్డి, చెన్నక్రిష్టారెడ్డి, శివారెడ్డి, నాగభూషణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

పుట్టపర్తి: పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని ఆ పార్టీ సీనియర్‌నేత దుద్దుకుంట శ్రీనివాస్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. బుక్కపట్నంలో గురువారం రిటైర్డు పీఆర్.డీఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు వారం రోజులు ఎంతో కీలకమైనవని, ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేసి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, పెయింట్ వెంకటేష్, మండల పరిశీలకులు బిల్డర్ మల్లికార్జున, రఘునాథరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, నారాయణస్వామి,బాబు,కొత్తకోట ఎంపీటీసీ హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే సంక్షేమ పథకాలు



కొండాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మండలపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు వివరించారు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని కొండాపురం గ్రామంలో వైఎసార్‌సీపీ నాయకులు కోఆప్షన్ మెంబర్ వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్ సంజీవమ్మ, నాయకులు మారుతీ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మకు ఓటేయాలని కోరారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దని, ఆయన విడుదల చేసిన మేనిఫెస్టో బూటకమన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బోయ నరసింహా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు గురురాజ్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, తయూబ్, శేషాద్రి, రామాంజినేయులు, కోఆప్షన్ మెంబర్లు ముహీబా మున్నీర్, నేమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ కన్వీనర్లు, సర్పంచులు, పార్టీ ముఖ్యనాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ విజయం కోసం ఇంటింటి ప్రచారం చేశారు. పేదల సంక్షేమ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను వివరించారు.

చంద్రబాబువి బూటకపు హామీలు



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సోమందేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు అబద్ధపు హామీలను ఎవరూ నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. గురువారం మండలంలోని బ్రహ్మసముద్రం, చల్లాపల్లి, ఈదుళబలాపురం, నాగినాయని చెరువు తండా, మాగే చెరువు, సోమందేపలి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బాబు అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఉషశ్రీచరణ్‌లను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, సర్పంచ్ పరంధామ, అంజినాయక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సేవాదళ్ చైర్మన్ వేణు, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, నాయకులు ఈశవర్, కంబాలప్ప, ఆదెప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టుకుని వదిలేశారు!

కొత్తచెరువు: బండ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేత ఇంట్లో గురువారం సెబ్ పోలీసులు మద్యం పట్టుకుని వదిలేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల సమాచారం మేరకు....గురువారం ఉదయం సెబ్ పోలీసులు అయూబ్‌ఖాన్ ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. విషయం తెలుసుకున్న అయూబ్‌ఖాన్ పరారయ్యాడు. ఈసందర్భంగా 22 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. అయాబ్‌ఖాన్ భార్యను విచారించిన స్టేషన్‌కు రావాలని కోరారు. తాను పోలీస్ వాహనంలో రానని, బస్సులో వస్తానని చెప్పింది. పోలీసులు బండ్లపల్లి క్రాస్‌కు చేరుకున్నాక టీడీపీ నాయకులు వారిని కలిసి బేరం పెట్టినట్లు సమాచారం. దీంతో సెబ్ పోలీసులు అక్కడి నుంచి నిష్క్రమించినట్లు తెలిసింది. దీనిపై సెబ్ ఎస్ఐ రమణారెడ్డికి సంప్రదించగా అలాంటిదేమీ లేదంటూ సమాధానం దాటవేశారు. ఇదిలా ఉండగా అయూబ్‌ఖాన్ అనేక సార్లు కర్ణాటక మద్యం అమ్ముతూ పట్టుబడినట్లు సమాచారం.

పింఛన్‌దారుల కష్టాలు



బ్యాంకు నుంచి వెనుదిరుగుతున్న పింఛన్ దారులు



సోమందేపల్లి : కెనరా బ్యాంకులో క్యూలో నిలబడిన పింఛన్‌దారులు

రొద్దం/గోరంట్ల/సోమందేల్లి: 'ఎండనకా.. వాననకా ఒకటో తేదీ వచ్చిందంటేచాలు తెల్లవారుజామునే ఠంఛన్‌గా పింఛన్ సొమ్ముచేతికిచ్చేవాళ్లు. జగనన్న ప్రభుత్వంలో పింఛన్ కోసం ఆరాటపడే రోజులే మర్చిపోయాం. అయితే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కుట్రలతో ఇప్పుడు మళ్లీ పాతరోజులు గుర్తుచేస్తున్నారు. ఈ పాపం వాళ్లకు కచ్చితంగా తగులుతుంది' అంటూ పింఛన్‌దారులు శాపనార్థాలు పెడుతున్నారు. చాలా మంది బ్యాంకు ఖాతాలు ఆధార్‌కు అనుసంధానం కాకపోవడం, డబ్బులు తీసుకునేందుకు పింఛన్‌దారులు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో పింఛన్‌దారులతో బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి. ఎండలు దంచికొడుతుండటంతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు నానా అవస్థలు పడుతున్నారు. ఇన్నాళ్లూ కాలు కదపకుండానే ఇంటి వద్దకే పింఛన్ వచ్చేలా చేసినా జగనన్నకే తమ మద్దతని లబ్ధిదారులు చెబుతున్నారు.

బ్యాంకు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా...



నాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. అయితే చంద్రబాబు కుట్రల వలన రెండు నెలల నుంచి పింఛన్ కోసం అవస్థలు పడుతున్నాను. ఈనెల పింఛన్ బ్యాంకులో వేస్తామన్నారు. బ్యాంకుకు వెళ్తే ఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదన్నారు. ఉదయం నుంచి కాసుకొని ఉన్నా పనికాలేదు. ఆధార్ అప్‌డేట్ అయిన తర్వాత డబ్బులిస్తామన్నారు. చంద్రబాబు రాజకీయాల కోసం మాలాంటి వాళ్లను ఇబ్బంది పెట్టడం సరికాదు. – సత్తార్‌సాబ్ , గోరంట్ల

బాబు వల్ల తిప్పలు పడుతున్నాం



వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందించే వాడు. చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇవ్వడం లేదు. సచివాలయం వద్ద ఇస్తామన్నారు. అక్కడా ఇవ్వటం లేదు. అకౌంట్‌లో పడ్డాయి బ్యాంకుకు వెళ్లి తీసుకోమన్నారు. ఈ ఎండకు లైన్‌లో నిలబడ లేక ఇంటికి వచ్చేశాను. చంద్రబాబు వల్ల ఇన్ని తిప్పలు పడుతున్నాం. – తిప్పన్న, సోమందేపల్లి

మృతుడికి నివాళి

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని గోకులం చెందిన ఆదినారాయణరాజు (56) గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదినారాయణరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు నారపరెడ్డి, కులశేఖర్‌రాజ, రామకృష్ణ ఉన్నారు.